సాక్షి ఒడిశా

గురువారం । 7 । సెప్టెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్‌: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,53,318లు, బంగారం 2 గ్రాములు, వెండి 47 గ్రాముల మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా

రాష్ట్రవ్యాప్తంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. పాఠశాలలు, ఆలయాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో చిన్నారులు శ్రీకృష్ణుడుగా.. గోపికలుగా ముస్తాబై అలరించారు.

- 8లో



భద్రతకు భరోసా

రైలు ప్రయాణంలో భద్రతకు ఇటీవల విస్తరించిన ఆటో సిగ్నలింగ్‌ వ్యవస్థ హామీగా నిలుస్తుందని తూర్పు కోస్తా రైల్వే ప్రకటించింది. ఈ జోన్‌ పరిధిలో పలుచోట్ల ఈ వ్యవస్థ వాస్తవ కార్యాచరణ మొదలైనట్లు పేర్కొంది.

- 8లో

న్యూస్‌రీల్‌

చోరీ కేసు నిందితులు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

రాయగడ: ఒక మొబైల్‌ షాపులో చోరీ కేసుకు సంబంధించి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలియజేశారు. వారి వద్ద నుంచి 35 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వాటిలో 31 స్మార్ట్‌ఫోన్లు కాగా, మరో నాలుగు కీప్యాడ్‌ ఫోన్లు ఉన్నాయి. ఈ మేరకు స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో డీఎస్పీ ప్రతాప్‌ చంద్ర త్రిపాఠి, ఐఐసీ కమలా కాంత్‌ కుహరోలు వివరాలను వెల్లడించారు. స్థానిక రైతు కాలనీ రెండో లైన్‌లో శిల్ల సంతోష్‌ కుమార్‌ అనే వ్యక్తికి సంబంధించిన షాపులో ఆగస్టు 24వ తేదీన గుర్తు తెలియని దుండగులు చోరీచేసి, 45 సెల్‌ఫోన్లను దొంగిలించారు. దీనిపై బాధితుడు సదరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టి నలుగురు మైనర్‌ బాలురు దొంగిలించినట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వెనుక ఎవరి హస్తం ఉందన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నకిలీ వాటర్‌ బాటిల్స్‌ ప్లాంట్‌ సీజ్‌



అరెస్టు చేసిన వ్యక్తిని చూపిస్తున్న పోలీసులు

బరంపురం: నగరంలో అక్రమంగా నకిలీ వాటర్‌ బాటిల్స్‌ తయారు చేస్తున్న ప్లాంట్‌పై పోలీసులు దాడిచేసి ఒకరిని అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి భూపతి మహంతి తెలిపిన వివరాల మేరకు.. స్థానిక గౌరంగ విహార్‌లో ఉన్న ఇంటిపై పోలీసులు బుధవారం దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలు అతిక్రమించి తయారు చేస్తున్న వాటర్‌ బాటిళ్లను సీజ్‌చేసి, యజమానిని అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తి సాయి రంజన్‌ సాహుగా గుర్తించినట్లు తెలియజేశారు.

తల్లీ, కుమారుడిపై దాడిచేసిన వ్యక్తులు అరెస్టు



అరెస్టైన నిందితులు

జయపురం: తల్లీ, కుమారుడిపై దాడిచేసిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు జయపురం సదర్‌ పోలీసుస్టేషన్‌ అధికారి ఈశ్వర తండి వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 2వ తేదీన అంత గ్రామానికి చెందిన రూప అనక అనే మహిళ సామాన్లు కొనుక్కొని ఇంటికి వస్తోంది. ఆ సమయంలో ఆమె బంధువు విజయ్‌ ఉరఫ్‌ మోటు ఆమె వద్దకు వచ్చాడు. ఏదో కారణం వలన ఆమెను అసభ్య పదజాలంతో తిడుతూ దాడి జరిపాడు. వెంటనే విజయ భార్య వచ్చి రూపను రక్షించింది. అయితే కొంత సమయం తర్వాత రూప కుమారుడు అర్జున్‌ వచ్చి తన తల్లిని ఎందుకు కొట్టారని విజయ్‌ను అడిగాడు. ఆ సమయంలో విజయ్‌ పెద్ద కుమారుడు రాహుల్‌ వచ్చి తండ్రితో కలిసి రూప, ఆమె కుమారుడు అర్జున్‌లపై దాడి చేశారు. వారు కొట్టడంతో అర్జున్‌ తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్తులు అర్జున్‌ని ఆస్పత్రికి తరలించారు. రూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు మంగళవారం సాయంత్రం నిందితులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. గగనాపూర్‌ పోలీసు పండి అధికారి రాజకిశోర్‌ బారిక్‌ దర్యాప్తు చేసినట్లు పేర్కొన్నారు.

వివాహితను వేధించిన వ్యక్తి అరెస్టు



అరెస్టైన విశ్వనాథ్‌ నాయిక్‌

జయపురం: వివాహితను వేధిస్తున్న వ్యక్తిని జయపురం పట్టణ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని కొత్తవీధి 3వ లైన్‌కు చెందిన ఒక వివాహిత తన ఇంటి ముందు నివాసముంటున్న విశ్వనాథ్‌ నాయిక్‌ ఉరఫ్‌ బేబీ తనను అసభ్య భాషలో తిడుతూ వేధిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనను, తన తల్లిని చంపుతానని భయపెడుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేశారు. కేసుని పట్టణ ఎస్‌ఐ బిష్ణుచరణ బెహర దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

అల బృందావనంలో...!




జయపురం: అశ్వరథంపై రాధాకృష్ణులు



బరంపురం: ప్రత్యేక అలంకరణలో గోకులదామ్‌



పర్లాకిమిడి: సరస్వతీ శిశు విద్యా మందిర్‌ విద్యార్థుల శోభాయాత్ర



జయపురం: కోట్‌పాడ్‌లో జరిగిన వేడుకల్లో రాధాకృష్ణ వేషధారణల్లో చిన్నారులు

జగన్నాటక సూత్రదారి అయిన మహావిష్ణువు అవతారాల్లో ఒకటైన అవతారం శ్రీకృష్ణావతారం. లోక కల్యాణం కోసం కృష్ణుడిగా జన్మించిన నల్లనయ్య జన్మాష్టమి వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా వైభవంగా జరుగుతున్నాయి. ఇస్కాన్‌ ఆలయాలు సుందరంగా ముస్తాబయ్యాయి. కన్నయ్య వేషధారణల్లో చిన్నారులు ముద్దులొలికించారు. గోవర్ధన గిరిధారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్‌



బరంపురం: గోకులదామ్‌లో రాధ, రుక్మిణితో కొలువైన శ్రీకృష్ణుడు



పర్లాకిమిడి: సరస్వతీ శిశు విద్యామందిర్‌లో ఆకట్టుకుంటున్న వేషధారణలు



పర్లాకిమిడి: పాఠశాల ఆవరణలో రాధాకృష్ణులు



కొరాపుట్‌: కన్నయ్య వేషధారణలో చిన్నారి స్వరాజ్‌ పండా

జీ–20 సమావేశానికి రాయిమతి

- చోడి పంటపై ప్రసంగించనున్న మహిళ



సమావేశంలో పాల్గోనున్న రాయిమతి ఘువురియ

జయపురం: ఈనెల 9వ తేదీన న్యూఢిల్లీలో జరగనున్న జీ–20 సదస్సులో పాల్గొనేందుకు కొరాపుట్‌ జిల్లా జయపురం సబ్‌ డివిజన్‌ కుంద్రా సమితి లిమ గ్రామ పంచాయతీ నువాగుడ గ్రామానికి చెందిన రాయిమతి ఘువురియ ఎంపికయ్యారు. దీనిలో భాగంగా ఆమె కొరాపుట్‌ మండియ(కొరాపుట్‌ చోడి)పై వివరించనున్నారు. తాను స్వయంగా పండించిన వివిధ రకాల చోడి, సాంప్రదాయ వ్యవసాయ పరికరాలను ఆమెతో పాటు ఢిల్లీ తీసుకెళ్లారు. శిఖరాగ్ర సభలో చోడి వలన కలిగే లాభాలు, చోడితో తయారు చేసే ఆహార పదార్థాలపై వివరిస్తారు. జీ–20 సమావేశంలో అర్థనీతి, జలవాయు పరివర్తన, విద్యా విషయంపై చర్చ జరుగుతుంది. ఈ సందర్భంగా జలవాయు పరివర్తనంకు చోడి వ్యవసాయం సమన్వయ పరచి ప్రసంగించనున్నట్లు తెలుస్తోంది. భవిష్యత్తులో ఆహార కొరత ఏర్పడితే చోళ్లు ఆ కొరతను భర్తీ చేస్తాయని వివరిస్తారు. అందువలన సమావేశంలో మిలెట్స్‌ (చిరుధాన్యాలు) విషయంపై వివరించేందుకు మన దేశం సన్నద్ధం తెలిపింది. ముందుగా సాంప్రదాయంగా వస్తున్న చోడి వ్యవసాయం, ప్రస్తుతం ఆధునిక విధానంలో పండించే విధానంపై వివరిస్తారు. ఆధునిక పద్ధతిలో చోళ్లు పండిస్తే రైతులు అధిక లాభాలు పొంది, ఆర్థికంగా బలోపేతం చెందుతారని పేర్కొంటారు. 2017–18లో చోడి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు మిలెట్‌ మిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. 2027 వరకు పైలెట్‌ ప్రాజెక్టుగా పరిగణించబడుతుందని రాష్ట్ర వ్యవసాయ విభాగం వెల్లడించడం గమనార్హం. జీ–20 శిఖరాగ్ర సభలో చోడి పంట ప్రచార వేదికగా రాయిమతి వినియోగించుకొని ప్రపంచ దేశాల అగ్ర నేతలను ఆకట్టుకోగలదనే ఆశాభావం రాష్ట్రంలోని ప్రముఖులలో వ్యక్తమవుతోంది.

రోడ్డు ప్రమాదంలో యువకుని దుర్మరణం



కన్హు మృతదేహం

రాయగడ: రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు దుర్మరణం పాలయ్యాడు. జిల్లాలోని గుణుపూర్‌ ఆదర్శ విద్యాలయం సమీపంలో బుధవారం చోటుచేసుకున్న ఘటనలో మృతుడు శిరిఝొలి గ్రామానికి చెందిన కన్హు గౌడొ (25)గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. తన గ్రామం నుంచి కన్హు బుధవారం మధ్యాహ్నం బైకుపై గుణుపూర్‌ వస్తున్నాడు. ఈ సందర్భంగా ఆదర్శ విద్యాలయం సమీపంలో ఎదురుగా వస్తున్న ఒక లారీ అదుపు తప్పి బైకును ఢీకొంది. ప్రమాదంలో యువకుడు అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని గుణుపూర్‌ సబ్‌ డివిజన్‌ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



సంఘటన స్థలం వద్ద కారు, స్కూటీ





ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

రాయగడ:

స్థానిక ఫ్లై ఓవర్‌ బ్రిడ్జిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. గాయపడిన వారిలో రైతుల కాలనీ రెండో లైన్‌కు చెందిన లిపస్‌ కుమార్‌ నాయక్‌ (35), మూడో లైన్‌కు చెందిన దీపక్‌ మిశ్రా(32)లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. దీపక్‌ అతని స్నేహితుడు లిపస్‌లు తమ పనులు ముగించుకుని స్కూటీపై ఇంటికి వెళ్తున్న సమయంలో బ్రిడ్జి మీద వెనుక నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొన్నట్లు ఐఐసీ కమలాకాంత్‌ కుహరో తెలియజేశారు. దీంతో ఇద్దరూ కిందపడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. కారు డ్రైవర్‌ సంతోష్‌ పాణిగ్రాహి ఫరారీలో ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జలమయం



కవిసూర్యనగర్‌లో వరద నీరు



అస్కా మెయిన్‌ రోడ్డులో...



బుగడా కాలనీలో...



వరద నీటిలో అవస్థలు పడుతున్న ప్రజలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో గత మూడు రోజులుగా గంజాం జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రూశికుల్య నదితో పాటు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీని ఫలితంగా చుట్టుపక్కల గ్రామాలతో పాటు నగర వీధులు, కాలనీలు జలమయమయ్యాయి. కవిసూర్యనగర్, పురుషోత్తపురం, బుగడా సమితి పరిధిలో పలు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరింది. ఫలితంగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వరద నీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– బరంపురం

క్లుప్తంగా

హిమాచల్ విపత్తుకు రూ.5 కోట్ల సాయం

భువనేశ్వర్: విపత్తుతో తల్లడిల్లుతున్న హిమాచల్ ప్రదేశ్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్ల సాయం అందజేసింది. వైపరీత్యాలతో అతలాకుతలమైన పరిస్థితుల్లో సహాయ, పునరావాస, పునరుద్ధరణ, పునర్నిర్మాణ వంటి చర్యల కోసం ఒడిశా ప్రభుత్వం హిమాచల్ విపత్తు సహాయ నిధికి రూ.5 కోట్లు జమచేసింది. దీంతో హిమాచల్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సుఖు రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు బుధవారం కృతజ్ఞతలు తెలిపారు. ఆపద సమయంలో ఉదారవాద విరాళం విపత్తు బాధిత ప్రజలను ఆదుకోవడంలో సహాయపడుతుందని, విపత్తు సహాయ నిధికి ఉదారంగా సహకరించాలని సుఖ్విందర్ సుఖు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


దళ్లి రాంబాబు(ఫైల్)

పొందూరు: మండలంలోని దళ్లిపేట గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన విద్యుత్ ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందారు. దళ్లిపేట గ్రామానికి చెందిన దళ్లి రాంబాబు(33) శ్రీకాకుళంలోని శివజ్యోతి మెస్ లో పనిచేస్తున్నాడు. రాత్రి వరకు పనిచేసి ఇంటికి చేరుకున్నాడు. నిద్రలో టేబుల్ ఫ్యానుకు కాలు తగిలి మీదపడి షాక్ కొట్టింది. దీంతో అతను పెద్దగా కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు లేని ఫ్యాన్ స్విచ్ ఆఫ్ చేశారు. అప్పటికే రాంబాబు అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో ప్రాథమిక చికిత్స కోసం తీసుకెళ్తుండగా తానెం సమీపంలో ప్రాణాలు విడిచాడు. దీంతో మృతదేహాన్ని తిరిగి గ్రామానికి తీసుకువచ్చారు. భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గతంలో అతని తండ్రి దళ్లి లక్ష్మణ తాటిచెట్టు కొడుతుండగా మీద పడి మృతి చెందాడు. రాంబాబు మృతితో అతని కుటుంబం రోడ్డున పడింది. రాంబాబుకు భార్య జ్యోతి ఇద్దరు ఆడ పిల్లలు, తల్లి పాపయ్యమ్మ ఉన్నారు. వీరంతా కన్నీటిపర్యంతమయ్యారు.

పోలీసులకు గాయాలు

రాంబాబు మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, కానిస్టేబుల్ నాగేశ్వరరావులు బైక్‌పై వెళ్తుండగా చిలకపాలెం సమీపంలో పేపర్ వ్యాను ఢీకొట్టింది. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు.

మొన్న పదోన్నతి.. నిన్న మృతి


తెంబ వాసుదేవు

సోంపేట: మండలంలోని బారువ మేజర్ పంచాయతీ ఈఓగా, సోంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఈఓపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న తెంబ వాసుదేవు(56) బుధవారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం వరకు బారువ మేజర్ పంచాయతీ ఈఓగా విధులు నిర్వహిస్తున్న వాసుదేవు ఈఓపీఆర్డీగా పదోన్నతి పొంది మన్యం జిల్లాకు మంగళవారం బదిలీ అయ్యారు. బుధవారం విధుల్లో చేరాల్సి ఉంది. అయితే అనారోగ్యంతో సోంపేట ప్రైవేటు ఆస్పత్రిలో మంగళవారం చేరారు. చికిత్స పొందుతూ మృతి చెందా రు. ఆయన భార్య ఏడాది కిందటే మృతి చెందారు. వాసుదేవ్ మృతిపై జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, వైఎస్సార్ సీపీ ఇచ్ఛాపురం సమన్వయకర్త పిరియా సాయిరాజ్, ఎమ్మెల్సీ నర్తురామారావు, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ తడక యశోద, ఎంపీడీఓ బెందాళం వెంకటరమణ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది సంతాపం తెలియ జేశారు. గురువారం వాసుదేవు స్వగ్రామం మందస మండలంలోని మూలుపాడు గ్రామంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

రణస్థలం: మండలంలోని నెలివాడ జాతీయ రహదారిపై వంతెనపై సోమవారం రాత్రి 9గంటల సమయంలో రోడ్డు ప్రమాదంలో వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జేఆర్ పురం ఎస్ఐ జి.రాజేష్ తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి తొలుత శ్రీకాకుళంలోని రిమ్స్ కు అక్కడి నుంచి వైజాగ్‌లోని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. మృతుడి వయసు 35 ఏళ్లు ఉంటాయని, ఎవరికైనా వివరాలు తెలిస్తే జేఆర్ పురం ఎస్ఐ జి. రాజేష్ ఫోన్ నంబర్ 63099 90850కు సమాచారం అందించాలని తెలిపారు.

సనాతన ధర్మం వర్ధిల్లాలని నడక యాత్ర

కాశీబుగ్గ: భారత సనాతన ధర్మం వర్ధిల్లాలని కోరుతూ పంజాబ్ రాష్ట్రానికి చెందిన రితిషిక్ షేనా అనే యువకుడు నడకయాత్ర చేపట్టాడు. ఆల్ ఇండియా ట్రావెలర్ అయిన యువకుడు చార్‌ధామ్ యాత్ర, దేశంలో 12 జ్యోతిర్లింగాలను నడకయాత్రతో చేపడుతున్నాడు. జాతీయ రహదారిపై ఇప్పటి వరకు 6400 కిలోమీటర్లు ప్రయాణించానని, రోజుకు వంద నుంచి నూటాయాభై కిలోమీటర్లు నడుస్తున్నానని తెలిపారు. బుధవారం పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల మీదుగా ప్రయాణం కొనసాగించడంతో పలువురు ఆయనకు పలకరించి సెల్ఫీలు తీసుకున్నారు.


బరంపురం: కృష్ణుడి వేషధారణలో చిన్నారుల నృత్యాలు


రాయగడ: సరస్వతి విద్యా మందిరంలో వివిధ వేషధారణల్లో విద్యార్థులు


జయపురం: రాధాకృష్ణులను ఊరేగిస్తున్న దృశ్యం


కొరాపుట్: ఉమ్మర్ కోటలో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నిత్యానంద గోండో

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా

రాష్ట్రవ్యాప్తంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. పాఠశాలలు, ఆలయాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో చిన్నారులు శ్రీకృష్ణుడుగా.. గోపికలుగా ముస్తాబై అలరించారు. చిలిపి కృష్ణుడు వేషధారణలో పిల్లలను చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఉట్టికొట్టే కార్యక్రమాల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


జయపురం: నెహ్రూనగర్‌లో గోపిక వేషధారణలో చిన్నారి


జయపురం: మందిరంలో పూజలందుకుంటున్న శ్రీకృష్ణుడు


బరంపురం: గోకులధామ్‌లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


జయపురం: జన్మాష్టమి నినాదాల ప్లకార్డులతో మహిళల ర్యాలీ


రాయగడ: పూజలందుకుంటున్న కన్నయ్య


జయపురం: ఎగ్జిబురిటీ ప్లే స్కూల్‌లో జన్మాష్టమి వేడుకలు


పర్లాకిమిడి: సరస్వతీ శిశు విద్యా మందిర్ విద్యార్థుల శోభాయాత్ర


బరంపురం: ఆకట్టుకుంటున్న చిన్నారి గొల్లభామల నృత్యాలు


రాయగడ: ఉట్టికొట్టే కార్యక్రమంలో విద్యార్థులు


పర్లాకిమిడి: రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు


పర్లాకిమిడి: శ్రీకృష్ణుడిని బుట్టలో తీసుకెళ్తున్న వసుదేవుడు వేషధారి


జయపురం: గీతా మందిరంలో పూజలందుకుంటున్న శ్రీకృష్ణుడు


జయపురం: వేషధారణ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

భద్రతకు భరోసా

- రైళ్లలో ఆటో సిగ్నలింగ్ వ్యవస్థ
- ఒకే ట్రాక్‌పై వచ్చే రైళ్లలో ప్రమాదాల నివారణకు మార్గం
- ప్రకటించిన తూర్పుకోస్తా రైల్వే

భువనేశ్వర్: రైలులో ప్రయాణం అత్యంత భద్రం. ఈ భద్రతకు ఇటీవల విస్తరించిన ఆటో సిగ్నలింగ్ వ్యవస్థ హామీగా నిలుస్తుందని తూర్పు కోస్తా రైల్వే ప్రకటించింది. ఈ జోన్ పరిధిలో పలుచోట్ల ఈ వ్యవస్థ వాస్తవ కార్యాచరణ మొదలైనట్లు పేర్కొంది. ఈ వ్యవస్థ కార్యాచరణతో ఒకే మార్గంలో ఒకదాని వెంబడి మరో రైలు నడిచేందుకు వీలవుతుంది. రెండు రైళ్ల మధ్య 75 మీటర్ల నుంచి 150 మీటర్ల దూరంతో ఒకే దిశలో రెండు రైళ్లని నడిపిస్తారు.

పనితీరు ఇలా...

ప్రధాన రైల్వేస్టేషన్ల పరిసర ప్రాంతాల మార్గంలో కొన్నిచోట్ల రైళ్ల రద్దీ అధికంగా ఉంటుంది. ఇటువంటి ప్రాంతాల్లో రైలుని నిలిపివేయకుండా నెమ్మదిగా ముందుకు నడిపిస్తారు. లోగడ ఈ సదుపాయం లేదు. ఎరుపు, పసుపు, డబుల్ ఎల్లో, ఆకుపచ్చ ఇలా 4 రంగుల సిగ్నల్స్‌తో ఆటో సిగ్నలింగ్ వ్యవస్థ పని చేస్తుంది. రైళ్ల రద్దీ ఉన్న ప్రాంతాల్లో 1 కిలో మీటరు దూరంలో ఒక్కో ఆటో సిగ్నల్ ఉంటుంది. ఈ లెక్కన 1 కిలో మీటరు దూరం నుంచి రైలు నియంత్రిత వేగంతో ముందుకు సాగడంతో ప్రాణహాని వంటి విపత్కర పరిస్థితులకు అవకాశం ఉండదు.

రైళ్ల మధ్య దూరం

ఒకే ట్రాక్‌పై ఒకే దిశలో ఒక దాని వెంబడి మరో రైలుని పంపించేందుకు ఆటో సిగ్నలింగ్ వ్యవస్థ దోహదపడుతుంది. ఈ వ్యవస్థ మార్గదర్శకాల మేరకు ఒక ట్రాక్‌పై పరుగులు తీస్తున్న రైళ్ల మధ్య దూరం నిర్ధారితం. మెమూ వర్గం రైళ్ల మధ్య దూరం 75 మీటర్లు కాగా ఇతర వర్గాల రైళ్ల మధ్య దూరం 150 మీటర్లుగా నిర్ధారించారు.

ఆగుతూ కదులుతాయి

ఆటో సిగ్నల్ పరిధిలో ఎరుపు సిగ్నల్ రైలు నిలిపేందుకు సంకేతం. పసుపు సిగ్నల్ పరిమిత వేగంతో ముందుకు సాగేందుకు అనుమతి. డబుల్ ఎల్లో సిగ్నల్ నియంత్రిత వేగంతో అత్యంత అప్రమత్తంగా ముందుకు సాగాల్సి ఉంటుంది. ఇలా ఆకుపచ్చ సిగ్నల్ వచ్చేంత వరకు నియంత్రిత వేగంతో రైలు


కటక్ - జగత్‌పూర్ మార్గంలో ఒకే దిశలో నిలిచిన 2 మెమూ రైళ్లు

నెమ్మదిగా కదులుతుంది. దీంతో ఒకే మార్గంలో ఒకే దిశలో వెళ్తున్న రెండు రైళ్ల మధ్య ఢీకొనే ప్రమాదానికి దాదాపు అవకాశం లేదు.

లోకో పైలట్‌కు మార్గదర్శకాలు

ఆటో సిగ్నల్ పరిధిలో ఎరుపు తారసపడితే రైలుని నిలపాల్సి ఉంటుంది. అయితే ఈ నిలుపుదల స్వల్ప నిడివికి పరిమితం. పగటిపూట ఒక నిమిషం మరియు రాత్రి రెండు నిమిషాలు వేచి ఉండాల్సి ఉంటుంది. ఈ నిరీక్షణ వ్యవధి తర్వాత కూడా సిగ్నల్ 'ఆన్' స్థానంలో ఉన్నట్లయితే, లోకో పైలట్ తప్పనిసరిగా నిర్దిష్ట విధానాలను అనుసరించాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా రైలు మేనేజర్ (గార్డు)తో సిగ్నల్ మార్చుకుని ఎటువంటి అడ్డంకులు లేకుండా చాలా జాగ్రత్తగా ముందుకు వెళ్లడం వంటి చర్యలను చేపట్టాల్సి ఉంటుంది. లోకో పైలట్, రైలు మేనేజర్ పటిష్టమైన సమన్వయంతో పరిమిత వేగంతో నెమ్మదిగా రైలుని ముందుకు నడిపిస్తారు. విపరీత దిశలో సిగ్నలింగ్ వ్యవస్థ స్పష్టంగా కనిపించే (విజిబిలిటీ) పరిస్థితుల్లో గరిష్టంగా గంటకు 15 కిలోమీటర్ల వేగం, లేకుంటే 10 కిలో మీటర్ల పరిమిత వేగంతో రైలు కదులుతుంది.

భయం అవసరం లేదు

తూర్పు కోస్తా రైల్వేలో పలుచోట్ల ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థలో రైలు రవాణా నిర్వహిస్తున్నారు. ఈ వ్యవస్థ పరిచితం కానందున సాధారణ ప్రయాణికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఒకే ట్రాక్‌పై 2 రైళ్లు నిలిచి ఉన్న పరిస్థితుల్ని వీడియో చిత్రీకరించి భయాందోళనలు కలిగించే రీతిలో ప్రసారం అవుతున్నాయి. ఈ ప్రసారంపై సాధారణ ప్రజానీకం, ప్రయాణికులు భయపడాల్సింది లేదని రైల్వే శాఖ అభయం ఇచ్చింది. అనుమతించదగిన వేగంతో మరియు కట్టుదిట్టమైన భద్రతా చర్యలతో రైళ్లు నడపడం జరుగుతుంది. ప్రయాణికుల భద్రతకు పూర్తి భరోసా ఇస్తున్నామని తెలిపింది. ఒకే దిశలో రైళ్లు ఒకదానికొకటి సమీపంలో నియంత్రిత వేగంతో రవాణా చేయడం ఈ వ్యవస్థతో సాధ్యం అవుతుంది. మరియు అత్యంత భద్రతను కలిగి ఉంటుందని పేర్కొంది. సిగ్నలింగ్ వ్యవస్థలో భాగంగా తూర్పు కోస్తా రైల్వే ఖుర్దారోడ్ మండలం కటక్ - జగత్‌పూర్ మార్గంలో ఒకే దిశలో 2 మెమూ రైళ్లు ఒకదాని వెంబడి నిలిచి ఉన్నట్లు ప్రయాణికుల దృష్టికి రావడంతో వీడియో వైరల్ అయ్యింది.

గ్యాస్ సిలిండర్ లీక్.. తప్పిన ప్రమాదం

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళంలోని పాత బస్టాండ్ సమీపంలో బుధవారం గ్యాస్ సిలిండర్ లీకైంది. అయితే సిబ్బంది సకాలంలో స్పందించడంతో ప్రమాదం తప్పింది. స్థానికులు, షాపు యజమాని రఫీ తెలిపిన వివరాల ప్రకారం.. సబ్ డివిజనల్ పోలీసు కేంద్రం పక్కన షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న బిస్మిల్లా బిర్యానీ సెంటర్ దుకాణానికి కమర్షియల్ గ్యాస్ సిలిండర్ భారత్ గ్యాస్ డెలివరీ బాయ్ తీసుకొచ్చాడు. ఈ క్రమంలో దుకాణ యజమానికి సిలిండర్‌ను పరీక్షించి చూపించేందుకు డెలివరీ బాయ్ మీద కప్‌ను తీయగా ఒక్కసారిగా గ్యాస్ ఎక్కువ మొత్తంలో లీకైంది. పక్కనే కాలుతున్న పొయ్యి ఉండటంతో అక్కడే ఉన్న జ నం ప్రాణభయంతో పరుగులు తీశారు. డెలివరీ బాయ్ రిస్క్ ఉన్నా చాకచక్యంగా సిలిండర్‌పై కప్ పెట్టడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఘటన జరిగిన పరిసరాల్లోనే పెట్రోల్ బంక్ ఉండటంతో అక్కడికొచ్చిన వాహనదారులు సైతం తమ ద్విచక్రవాహనాలను వదిలి దూరంగా వెళ్లిపోయారు. బంక్ నిర్వాహకులు సైతం అప్రమత్తమై కాసేపు ఆపేయడంతో పెను ప్రమాదం తప్పింది.

తాత్కాలిక ఉపశమనం

- జగన్నాథుని భూముల్లో తవ్వకాలపై హైకోర్టు విచారణ
- ఎన్జీటీ జరిమానా ఉత్తర్వులు తాత్కాలికంగా నిలిపివేత
- అక్టోబర్ 4న తదుపరి విచారణ

భువనేశ్వర్:

శ్రీజగన్నాథుని భూముల్లోని తవ్వకాల వివాదంలో పూరీ జగన్నాథ ఆలయం పాలక అథారిటీ (ఎస్‌జేటీఏ)కి తాత్కాలిక ఉపశమనం లభించింది. గతేడాది ఈ వివాదంపై విచారణ జరిపిన జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) రూ.12 కోట్లు జరిమానా చెల్లించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఆలయ పాలక వర్గం రాష్ట్ర హైకోర్టుని ఆశ్రయించింది. ఈ కేసు పూర్వాపరాలను పరిశీలించిన హైకోర్టు ఎస్‌జీటీ జారీ చేసిన ఉత్తర్వులు తాత్కాలిక నిలిపివేతకు ఆదేశించింది. ఈ ఏడాది అక్టోబర్ 4వ తేదీ వరకు తాత్కాలిక నిలిపివేత కొనసాగుతుంది. జస్టిస్ బి.ఆర్.షడంగి, జస్టిస్ ఎం.ఎస్.రామన్‌తో కూడిన ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఖుర్దా జిల్లా కలెక్టర్, ఒడిశా రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (ఓఎస్‌పీసీబీ) మెంబర్ సెక్రటరీ, స్టేట్ ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ అథారిటీ మెంబర్ సెక్రటరీ, పిటిషనర్ బిధు భూషణ్ హరిచందలకు ధర్మాసనం నోటీసులు జారీ చేసి, తదుపరి విచారణ అక్టోబకు వాయిదా వేసింది.

500 ఎకరాల్లో తవ్వకాలు

ఖుర్దా జిల్లా నిజిగొడా తపాంగ్ పంచాయతీ పరిధిలోని దాదాపు 500 ఎకరాల శ్రీజగన్నాథ ఆలయ భూముల్లో అక్రమ రాళ్ల తవ్వకాలపై బిధు భూషణ్ హరిచందన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఎన్‌జీటీ ఈస్ట్ జోన్ బెంచ్ ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ భూముల్లో ప్రాథమికంగా జీడి పండ్ల తోట, గ్రామీణ అడవి (విలేజ్ ఫారెస్ట్) మరియు గోచర్ ల్యాండ్ (సాధారణ భూమి) ఉన్నట్లు పిటిషనర్ జాతీయ హరిత ట్రిబ్యునల్‌కు వివరించారు. ఫలసాయం అందించే చెట్లను తొలగించి గనుల తవ్వకాల కార్యకలాపాలు చేపట్టినప్పుడు సంబంధిత అధికారుల నుంచి పర్యావరణ క్లియరెన్స్ పొందలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ వివరాల ఆధారంగా విచారణ జరిపిన జాతీయ హరిత ట్రిబ్యునల్ ఈస్టర్న్ జోన్ రూ.12 కోట్లను డిపాజిట్ చేయాలని ఎస్‌జేటీఏను ఆదేశించింది. ఒక కమిటీని ఏర్పాటు చేసి ప్రణాళిక ప్రకారం 23 క్వారీల్లో తవ్విన ప్రాంతాల పునరుద్ధరణ కార్యకలాపాలు చేపట్టాలని ఆదేశించింది. ఈ ప్రక్రియను 4 నెలల్లో పూర్తి చేయాలని ఖుర్దా జిల్లా కలెక్టర్‌ను బెంచ్ ఆదేశించింది.

23 చోట్ల అక్రమ తవ్వకాలు

జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆధ్వర్యంలో ఒడిశా రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు (ఓఎస్‌పీసీబీ) నియమించిన నోడల్ ఏజెన్సీ అక్రమ గనుల తవ్వకం ప్రాంతాల్ని నిర్ధారించింది. ఈ నిర్ధారణ ప్రకారం 23 చోట్ల గనుల అక్రమ తవ్వకాలు జరిగినట్లు గుర్తించారు. ఈ ప్రాంతాల్లో ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు పునరుద్ధరణ కార్యకలాపాలు ప్రణాళిక బద్ధంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నోడల్ ఏజెన్సీ పరిశీలన ప్రకారం పూరీ జగన్నాథ ఆలయ భూముల్లో 72 చోట్ల గనుల తవ్వకాలు జరిపారు. వీటిలో 27 చోట్ల గనుల తవ్వకానికి పర్యావరణ అనుమతి, ఏర్పాటుకు సమ్మతి (సీటీఈ) మరియు నిర్వహణకు సమ్మతి (సీటీఓ) మంజూరయ్యాయి. మరో 24 ప్రాంతాల్లో తవ్వకాలకు సీటీఈ, 37 గనుల తవ్వకాలకు సీటీవో లేదని తేలింది.

శుభ కార్యానికి హాజరై..

శ్రీకాకుళం క్రైమ్ : శుభ కార్యానికి హాజరు కావడానికి వచ్చిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు భవనం రెండో అంతస్తు పై నుంచి పడిపోయి ప్రాణాలు కోల్పోయాడు. శ్రీకాకుళంలో బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కె.లక్ష్మి తెలిపిన వివరాల మేరకు.. ఎల్ఎన్‌పేట మండలం చిన్న కొల్లివలస గ్రామంలో ఆర్అండ్ఆర్ కాలనీలో కొర్ను నర్సింహులు (53) మేస్త్రీగా పనిచేసుకుంటూ జీవిస్తున్నారు. ఈయనకు భార్య, ఇద్దరు వివాహమైన కుమార్తెలు, ఐటీఐ చదివి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్న కుమారుడు ఉన్నారు. తన బంధువుల వివాహ వేడుకకు హాజరయ్యేందుకు శ్రీకాకుళం డేఅండ్‌నైట్ కూడలి సమీపంలోని వరం రెసిడెన్సీకి వచ్చారు. రెండో అంతస్తులో కల్యాణ మండపం ఉంది. అక్కడ భోజనం ముగించుకుని బయటకు వస్తుండగా ఫోన్ రావడంతో అక్కడే తెరిచి ఉన్న కిటికీ వద్ద మాట్లాడుతూ.. ప్రమాదవశాత్తు వెల్లకిలా వెనుకవైపు తూగి కిందకు పడిపోయాడు.


రక్తపు మడుగులో కొర్ను నర్సింహులు

అక్కడే ఉన్న నర్సింహులు తండ్రి సూర్యనారాయణ, బంధువులు చేరే సరికి తల వెను క బలమైన గాయం తగలి అపస్మారక స్థితిలో కనిపించాడు. వెంటనే ప్రైవేటు అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించినా ఫలితం లేకపోయింది. నర్సింహులు మృతి చెందాడని వైద్యులు నిర్ధారించడంతో అతని కుమారుడు సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.లక్ష్మి తెలిపారు.

క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణ కోసం ఎంపీకి వినతి

- ఎంపీ బెల్లానకు వినతిపత్రం అందజేసిన ఎంఆర్‌పీఎస్ ప్రతినిధులు



ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

చీపురుపల్లి: ఎస్సీలు అభ్యున్నతికి ఎంతో అవసరమైన వర్గీకరణ బిల్లు తీసుకొచ్చే విధంగా పార్లమెంటులో ప్రస్తావించాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భోగి శ్రీను, చీపురుపల్లి మండల అధ్యక్షుడు కోరుకొండ దాలయ్య కోరారు. ఈ మేరకు బుధవారం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గాల్లో ఏ, బీ, సీ, డీ ఉన్నట్లు ఎస్సీల్లో కూడా వర్గీకరణ జరగాలని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. ఎస్సీ వర్గకరణ జరిగే విధంగా చొరవ చూపాలని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పార్లమెంటులో కూడా చర్చించాలని కోరారు. ఎస్సీల్లో ఉన్న ఉప కులాలకు మేలు జరగాలంటే ఎస్సీ వర్గీకరణ జరగడం అవసరమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ చీపురుపల్లి నియోజకవర్గ కన్వీనర్ కిల్లాడ సురేంద్ర, రెల్లి కుల అధ్యక్షుడు రౌతు కనకరాజు, మెరకముడిదాం మండల అధ్యక్షుడు అప్పారావు మాదిగ, జిల్లా ప్రచార కార్యదర్శి గర్భాపు నరేష్, గుర్ల మండల కార్యదర్శి కింతాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



అదృశ్యమైన శ్రీలక్ష్మి(ఫైల్)

చీపురుపల్లి: పట్టణంలోని విజయ కాలనీకు చెందిన కె.శ్రీలక్ష్మి(43) అనే మహిళ అదృశ్యమైనట్లు తండ్రి డొప్ప అప్పారావు బుధవారం ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ ఎ.సన్యాశినాయుడు బుధవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు... అదృశ్యమైన శ్రీలక్ష్మి తన భర్తతో మనస్పర్థలు కారణంగా పదేళ్లుగా విజయ కాలనీలో తండ్రి వద్ద ఉంటోంది. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్వీపర్‌గా విధులు నిర్వహిస్తోంది. ప్రతీ రోజూ విధులకు వెళ్లినట్టుగానే సెప్టెంబర్ 2న ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి పాఠశాలకు వెళ్లింది. తిరిగి ఇంటికి చేరలేదు. దీంతో తండ్రి పాఠశాలకు వెళ్లి విచారించగా సెప్టెంబర్ 2న మధ్యాహ్నం 1 గంట వరకు పాఠశాలలో ఉండి తరువాత ఇంటికి వెళ్తానని చెప్పి ఆమె వెళ్లిపోయినట్లు అక్కడి వారు వివరించారు. కానీ తిరిగి ఆమె ఇంతవరకు ఇంటికి చేరలేదు. దీంతో శ్రీలక్ష్మి ఆచూకీ కోసం తండ్రి అప్పారావు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

గంజాయితో ముగ్గురి అరెస్టు

విజయనగరం క్రైమ్: గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను టుటౌన్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకుని, వారి నుంచి 25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి టు టౌన్ సీఐ ఎస్‌హెచ్.విజయానంద్ తెలిపిన వివరాలు.. వైఎస్సార్ నగర్‌లో గంజాయి విక్రయిస్తున్న సమాచారం తెలుసుకుని బుద్దరాజు రఘువర్మ, మందా రవిని అదుపులోకి తీసుకుని ఒకొక్కరి నుంచి పది కిలోల గంజాయి, మొబైల్, నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. వీరిద్దరు బరంపురం నుంచి శివరాం అనే వ్యక్తి నుంచి కిలో రూ.మూడు వేల చొప్పున గంజాయి కొనుగోలు చేసినట్టు తెలుసుకుని జేఎన్‌టీయూ జంక్షన్ సమీపంలో శివరాంను చూపించగా అతన్ని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. శివరాం నుంచి ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు పేర్కొన్నారు.

తైక్వాండో పోటీల్లో పతకాల పంట

విజయనగరం: జార్ఖండ్ రాష్ట్రంలో ఈ నెల 2 నుంచి 4వ తేదీవరకు జరిగిన 14వ ఓపెన్ జాతీయ స్థాయి తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌తో పాటు 12 పతకాలు సాధించారు. పోటీల్లో జిల్లా నుంచి 16 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో ఎం.గగన్ సాగర్‌దొర, కె.చైతన్య, బి.హేమంత్ కుమార్, బి.భవ్యశ్రావణి, టి.సంకీర్తనలు బంగారు పతకాలు సొంతం చేసుకోగా, పి.హర్షిణి, ఎస్.సాత్విక్, కె.సాహిత్యలు వెండి పతకాలు దక్కించుకున్నారు. జి.గౌతమ్, డి.ప్రియవల్లి, వి.దేవన్ మణికంఠ, వై.ముఖేష్ విశ్వనాథ్ కాంస్య పతకాలు సాధించారు. జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావు బుధవారం అభినందించారు. క్రీడల్లో రాణించిన యువత మంచి ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వర్ధమాన క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకోవాలని ఆకాంక్షించారు.

ఇండియా 1ఏటీఎంల్లో వరుస చోరీలు

- రెండో చోట్ల నగదు చోరీ
- గ్యాస్ కట్టర్లతో మిషన్లు కట్ చేసిన దుండగులు



బొండపల్లి: గ్యాస్ కట్టర్‌తో ఇండియన్ ఏ1 ఏటీఎం మిషన్‌ను కట్ చేసిన దృశ్యం



బొండపల్లి: గొట్లాంలోని ఏటీఎంను పరిశీలిస్తున్న ఎస్పీ దీపికా పాటిల్

బొండపల్లి: గజపతినగరం పోలీస్ సర్కిల్ పరిధిలో ఒకే రోజు రాత్రి గంటల వ్యవధిలో ఇండియన్ ఏటీఎంకు చెందిన రెండు కేంద్రాల్లో భారీ చోరీ జరిగింది. గ్యాస్ కట్టర్లు ఇతర పరికరాలను ఉపయోగించి ఏటీఎం యంత్రాలను కట్ చేసి అందులో నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. బుధవారం వేకువజామున జరిగిన ఈ చోరీలు స్థానికంగా సంచలనం కలిగించాయి. వివరాల్లోకి వెళ్తే.. దత్తిరాజేరు మండలం పెదమానాపురం సంతతోటలో గల ఇండియన్ ఏ1 ఏటీఎం కేంద్రంలో పాటు, బొండపల్లి మండలం గొట్లాం గ్రామంలో గల అదే ఏటీఎం కేంద్రంలో కూడా గుర్తు తెలియని దుండగులు నగదు అపహరించుకుపోయారు. దుండగులు ఏపీ 28సీఏ 2915 బొలెరో వాహనంలో వచ్చి చోరీకి పాల్పడినట్టు ఆధారాలు బట్టి తెలిసిందని ఎస్ఐ ఎస్.రవి తెలిపారు. గొట్లాం ఏటీఎం కేంద్రాన్ని ఎస్పీ ఎం.దీపికా పాటిల్‌తో పాటు బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీధర్, ఇన్‌చార్జి సీఐ ఎస్.తిరుమలరావు పరిశీలించారు. దగ్గరలోని దుకాణాల్లో గల సీసీ కెమెరాలను పరిశీలించి దొంగతనానికి పాల్పడిన తీరును పరిశీలించారు. ఏటీఎంకు సమీపంలోనే బొలెరో వాహనం నిలిపి అక్కడ నుంచి నగదు అపహరించుకుపోయినట్టు తెలుస్తుందన్నారు. వాహనంలో ఏటీఎంను తెరిచేందుకుగాను గ్యాస్ కట్టర్‌తో పాటు, గ్యాస్ సిలిండర్‌ను కూడా తెచ్చినట్టు గుర్తించామన్నారు. గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం మిషన్‌ను కట్ చేసి అందులో నగదును అపహరించుకుపోయినట్టు గుర్తించామని తెలిపారు. ఏటీఎం మిషన్‌లో ఎంత నగదు ఉందో, చోరీకి పాల్పడిన వారి వివరాలు తెలియరాలేదన్నారు. ఇప్పటి వరకు ఇండియన్ ఏటీఎం ఏ1 నిర్వాహకుల నుంచి ఫిర్యాదు అందలేదని తెలిపారు. విజయనగరం నుంచి వచ్చిన క్లూస్ టీం ఆధారాలు సేకరించిందని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టినట్టు పేర్కొన్నారు.



దత్తిరాజేరు: పెదమానాపురం ఏటీఎం వద్ద పరిశీలిస్తున్న బొబ్బిలి డీఎస్పీ శ్రీధర్

ఏటీఎంలో చోరీ

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం సంత వద్ద జాతీయ రహదారి పక్కనున్న ఇండియా-1 ఏటీఎంలో చోరీ జరిగింది. దుండగులు గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను కట్ చేసి భారీ మొత్తంలో నగదును ఎత్తుకెళ్లినట్టు పెదమానాపురం ఏఎస్ఐ కాశీరావు బుధవారం తెలిపారు. ఏఎస్ఐ తెలిపిన వివరాలు.. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న హోటల్ 99 వద్ద పార్కింగ్ చేసిన పెదమానాపురం గ్రామానికి చెందిన బోర రవి కారును అపహరించిన అనంతరం బీసీ కాలనీ వద్ద ఏడు కొండలు ఇంజినీరింగ్ వర్క్స్(వెల్డింగ్) షాపులో ఉన్న గ్యాస్ కట్టర్, గ్యాస్ బండలను కూడా అపహరించారు. అక్కడ నుంచి ఏటీఎంకు వెళ్లి చోరీకి పాల్పడ్డారు. రూ.11లక్షల 96 వేలు దోచుకెళ్లారు. సంఘటనా స్థలాన్ని ఎస్పీ దీపికా పాటిల్, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీధర్, గజపతినగరం ఎస్ఐ గంగరాజు పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నీ టాప్ స్కోరర్‌గా తపస్వి

- 358 పరుగులతో మొదటి స్థానం



పిన్నింటి తపస్వి

విజయనగరం: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 6 వరకు విశాఖ, విజయనగరం వేదికలుగా సీనియర్ విభాగంలో నిర్వహించిన అంతర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నీలో జిల్లాకు చెందిన పిన్నింటి తపస్వి 358 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడని విజయనగరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు బుధవారం తెలిపారు. రెస్టాఫ్ నార్త్ జట్టులో సభ్యుడైన తపస్వి శ్రీకాకుళం జట్టుతో జరిగిన తొలి మ్యాచ్‌లో 28 పరుగులతో నాటౌట్‌గా నిలవగా, రెస్టాఫ్ సెంట్రల్ జట్టుతో జరిగిన రెండో మ్యాచ్‌లో 70 పరుగులు సాధించాడు. గుంటూరుతో జరిగిన మూడో వన్డేలో మరింత విజృంభించి సెంచరీ (100 పరుగులు) సాధించగా, అనంతపురంతో జరిగిన నాలుగో మ్యాచ్‌లో 60 పరుగులతో రాణించాడు. రెస్టాఫ్ ఆఫ్ సౌత్‌తో జరిగిన ఆఖరి మ్యాచ్‌లో మరింత విజృంభించి చివరి వరకు నిలిచి సెంచరీ (100 పరుగులు) సాధించి నాటౌట్‌గా నిలవడమే కాకుండా మ్యాచ్‌ను గెలిపించాడు. రెస్టాఫ్ నార్త్ ఆడిన అన్ని మ్యాచ్‌లు గెలిచి టేబుల్ టాపర్‌గా నిలవడమే కాకుండా టాప్ ఆర్డర్‌లో రాణించిన తపస్వి 358 పరుగులతో రాష్ట్ర స్థాయిలోనే ప్రథమ స్థానంలో నిలిచాడు. తపస్విని డీసీఏ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు, ట్రెజరర్ పి.సీతారామరాజు, సెలెక్టర్లు బంగార్రాజు, పీఎస్ వర్మ, సర్పరాజ్‌లు, జిల్లా క్రికెట్ క్రీడాకారులు అభినందించారు.

గ్రామ స్వరాజ్యం ఘనత వైఎస్ జగన్‌దే..



భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, ఇతర ప్రజాప్రతినిధులు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం రూరల్: దేశ చరిత్రలోనే మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కిందని శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మండలంలోని మలిచర్ల, సుంకరిపేట గ్రామాల్లో రూ.40 లక్షలకు పైగా నిధులతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ కేంద్రాల ప్రారంభోత్సవ కార్యక్రమాలు బుధవారం జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల భవన ప్రారంభోత్సవాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఎంపీపీ మామిడి అప్పలనాయుడు మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంతోనే సాధ్యమైందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్యం, సుపరిపాలనకు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. రైతుభరోసా కేంద్రాలతో గ్రామాల్లోనే రైతులకు మెరుగైన సేవలు అందించడం జరుగుతుందన్నారు. మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు కెల్ల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ కొసరి నిర్మల, మలిచర్ల, సుంకరిపేట సర్పంచులు తుమ్మగంటి రమాకుమారి, సుంకరి రాజేశ్వరి, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

బిడ్డను రక్షించి.. మృత్యు ఒడిలోకి...

- బస్సు కింద పడి గిరిజనుడి మృతి
- తుంబన్న కాలనీలో విషాదం



ఈశ్వర్



బస్సు కింద పడి మరణించిన సింధు

సీతంపేట: ప్రమాదవశాత్తు బస్సు ముందు చక్రాల కింద పడి ఓ గిరిజనుడు బుధవారం మృతి చెందాడు. ఈ ఘటనతో తుంబన్నకాలనీలో విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని తుంబన్న కాలనీకి చెందిన ఆరిక సింధు(43) తన ఏడాదిన్నర కుమారుడు ఈశ్వర్‌ను చంకనెత్తుకుని నిత్యావసర సరుకుల కొనుగోలుకు కొత్తూరు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కొత్తూరు నుంచి పాలకొండ వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కాడు. మార్గ మధ్యంలో పులిపుట్టి వద్ద కుమారుడిని ఎత్తుకుని బస్సు దిగిపోయాడు. అక్కడ నుంచి తన స్వగ్రామమైన తుంబన్నకాలనీకి వెళ్లే క్రమంలో తాను దిగిన బస్సు ముందు భాగం నుంచి రోడ్డు దాటే యత్నం చేశాడు. వీరిని గమనించని బస్సు డ్రైవర్ బస్సును ముందుకు పోనివ్వడంతో సింధు బస్సు ముందు చక్రాల కిందకు వెళ్లిపోయాడు. తన చంకన ఉన్న చంటి బిడ్డ ఈశ్వర్‌ను దూరంగా విసిరేయడంతో బిడ్డ సురక్షితంగా బయటపడ్డాడు. ఈ ప్రమాదంలో సింధు మృతి చెందడంతో స్వగ్రామంలో విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ నీలకంఠం సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య మేరి, మరో ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- నాబార్డ్ డీజీఎం మురళీ మనోహర బెహరా



మహిళలతో చర్చిస్తున్న అధికారుల బృందం

విజయనగరం రూరల్: మహిళలు ఆర్థిక స్వావలంభనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని నాబార్డ్ డీజీఎం మురళీ మనోహర బెహరా పేర్కొన్నారు. మండలంలోని కొండకరకాం గ్రామంలో జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో నిర్వహిస్తున్న అగరబత్తీల తయారీ కేంద్రాన్ని అధికారుల బృందం బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా అగర్‌బత్తీ తయారీ కేంద్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ముడిసరుకు, ఉత్పత్తి, విక్రయాలపై మహిళలతో చర్చించారు. అనంతరం మహిళలతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై వారికి సూచనలు అందించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి, నాబార్డ్ డీడీఎం నాగార్జున, ఏపీడీ సావిత్రి, డీపీఎంబిటి లక్ష్మునాయుడు, ఏపీఎం స్వామి, సీసీలు నాయుడు, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు నదిలో పడి మహిళ మృతి



నదిలో తేలియాడుతున్న మంగమ్మ మృతదేహం

నెల్లిమర్ల: ప్రమాదవశాత్తు స్థానిక చంపావతి నదిలో పడి మహిళ మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం పూతికపేటకు చెందిన యడ్ల మంగమ్మ(49) గుర్ల మండలం గోషాడకు పరామర్శకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో జ్యూట్ మిల్లు సమీపంలో చంపావతి నదిలో జారిపడి మృతి చెందింది. జ్యూట్ మిల్లు గెస్ట్‌హౌస్ వద్ద నదిలో మృతదేహం లభ్యమైంది. బంగారమ్మకు చిన్నతనంలో వివాహం జరగ్గా భర్త వదలివేయడంతో తండ్రి వద్దే ఉంటుంది. ఎస్ఐ పి.నారాయణరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

పిచ్చి కుక్క స్వైర విహారం

- 15 మందికి గాయాలు



క్షతగాత్రులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



యలకల లావణ్య, అదపాక శ్రీను, మీసాలశీతం నాయుడు

చీపురుపల్లి: పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. మండలంలో ఐదారు గ్రామాల్లో కలియ తిరిగింది. కనిపించిన వారిని కనిపించినట్లే మీద పడి గాయపరిచింది. చిన్న, పెద్ద, ముసలి తేడా లేకుండా కంట పడిన ప్రతీ ఒక్కరినీ కరిచేసింది. శరీరాలపై ముక్కలు ఊడినట్లు రక్తం చిందేంత వరకు విడిచిపెట్టకుండా గాయపరిచింది. పిచ్చి కుక్క దాడిలో దాదాపు 15 మంది వరకు గాయపడ్డారు. వీరంతా పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో చికిత్స పొందుతున్నారు. అక్కడ చికిత్స పొందుతున్న క్షతగాత్రులను వైఎస్సార్ సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడులు పరామర్శించారు. తక్షణమే ఏంటీ రేబీస్ వ్యాక్సిన్లు వేసి, చికిత్స అందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.నాయక్‌ను కోరారు. బుధవారం ఉదయం నుంచి పిచ్చెక్కిన ఒకే కుక్క పదిహే మందిని గాయపరిచింది. మండలంలోని జి.ములగాంలో బుధవారం ఉదయం ప్రారంభమైన పిచ్చి కుక్క స్వైర విహారం ఇటకర్లపల్లి, పేరిపి, యలకలపేట, నాగంపేట, పుర్రేయవలస, జి.అగ్రహారం, చీపురుపల్లి ప్రాంతాల్లో కంట పడిన పదిహేను మంది వరకు గాయపరిచింది. పిచ్చి కుక్క దాడిలో గాయపడిన యలకల లావణ్య(పేరిపి), బెవర సింహాచలం(నాగంపేట), అదపాక శ్రీను(ఇటకర్లపల్లి), మీసాల శీతంనాయుడు(ఇటకర్లపల్లి), పున్నాన అప్పలరాము(యలకలపేట), గడల నీలకంఠం(చీపురుపల్లి), అంధవరపు రామారావు(చీపురుపల్లి) తీవ్ర గాయాలతో చీపురుపల్లి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. మరికొంత మందికి స్వల్ప గాయాలవ్వడంతో వ్యాక్సిన్ వేయించుకుని ప్రథమ చికిత్స చేయించుకుని ఇళ్లకు వెళ్లిపోయినట్లు వైద్యులు తెలిపారు.

ఆన్‌లైన్‌లో.. 'అంగన్‌వాడీ'ల సేవలు

అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు ఇకపై యాప్‌లో నమోదు కానుంది. కేంద్రం తెరిచిన నుంచి మళ్లీ ముగించే వరకు కేంద్రంలో జరిగే అన్ని కార్యకలాపాలు యాప్‌లో కార్యకర్త నమోదు చేయాలి. పిల్లల హాజరు నుంచి మధ్యాహ్న భోజనం వరకు ప్రతీది నమోదు చేయడం ద్వారా కేంద్రాల నిర్వహణలో పారదర్శకతను తెచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

- అంగన్‌వాడీ కేంద్రాలలో జరిగే ప్రతి విషయం ఆన్‌లైన్‌లో నమోదు
- అంగన్‌వాడీ కార్యకర్తలకు స్మార్ట్ ఫోన్లు అందజేసిన ప్రభుత్వం
- జిల్లాలో 2,499 అంగన్‌వాడీ కేంద్రాలు



పట్టణంలోని పోలయ్యపేటలో పిల్లలకు బోధిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త



ప్రభుత్వం అందించిన స్మార్ట్ ఫోన్

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కేంద్రాలను అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కేంద్రాల పట్ల ఉన్న అపవాదును తొలిగించే విధంగా చర్యలకు ఉపక్రమించింది. అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయడంతో పాటు ఎటువంటి అవకతవకలకు తావివ్వకుండా ఉండే విధంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరయ్యే పిల్లల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ, పూర్తి స్థాయిలో హాజరు అయినట్టు రికార్డుల్లో నమోదు చేసి వారికి అందాల్సిన పౌష్టికాహారం పక్కదారి పట్టిస్తున్నారనే అపవాదు అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉండేది. ఇటువంటివి ఇక్పై కుదరవు.

ప్రతీది ఆన్‌లైన్‌లో నమోదు

అంగన్‌వాడీ కేంద్రంలో రోజూ జరిగే ప్రతి విషయాన్ని వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. అంగన్‌వాడీ కేంద్రం తెరిచినప్పటి నుంచి ఉదయం 9 గంటలకు పిల్లలు హాజరు, గుడ్లు పెట్టినప్పుడు, మధ్యాహ్న భోజనం చేసినప్పుడు ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అదే విధంగా గర్భిణులు, బాలింతలకు టేక్ హోం రేషన్ ఇస్తున్నారు. టేక్ హోం రేషన్ ఇస్తున్నప్పుడు కూడా గర్భిణులు, బాలింతలకు ఫొటో తీసి వాటి వివరాలు కూడా యాప్‌లో నమోదు చేస్తారు. ఈ విధంగా యాప్‌లో అప్‌లోడ్ చేయడం వల్ల పారదర్శకత పెరుగుతుంది. ఫొటోలో ఉన్న వారి కంటే అదనంగా లబ్ధిదారులు కేంద్రానికి వచ్చారని చెప్పడానికి వీలు ఉండదు. దీని వల్ల గతంలో మాదిరి పిల్లలు రాకపోయినా వచ్చినట్టు హాజరు వేసుకోవడానికి వీలు ఉండదు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పథకాలు పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు అందుతాయి.

కార్యకర్తలు స్మార్ట్‌ఫోన్లు

అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రంలో జరిగే వివరాలు నమోదు కోసం స్మార్ట్ ఫోన్లు కొద్ది రోజులు క్రితం అందించింది. జిల్లాలో 2499 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 2499 మంది కార్యకర్తలు పని చేస్తున్నారు. వీరికి స్మార్ట్ ఫోన్లు అందించారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 9827 మంది గర్భిణులు, 9556 మంది బాలింతలు ఉన్నారు. 3నుంచి 6 సంవత్సరాలలోపు పిల్లలు 18,410మంది, 0 నుంచి 3 ఏళ్లలోపు పిల్లలు 44,755 మంది ఉన్నారు. వీరందరి వివరాలు అంగన్‌వాడీ కార్యకర్తలు వారికి ఇచ్చిన ఫోన్లలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్‌లో నమోదు చేయాలి.

బలవర్థకమైన ఆహారం

అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న పిల్లలకు ప్రభుత్వం బలవర్థకమైన ఆహారాన్ని అందిస్తుంది. రోజుకో రకమైన భోజనాన్ని అందిస్తుంది. ఆకు కూరలు, పప్పు, కాయగూరలు, గుడ్డుతో కూడిన ఆహారం అందిస్తుంది. పాలు ప్రతి రోజు అందిస్తుంది. పిల్లలకు 100 మి.లీ, గర్భిణులు, బాలింతలకు 200 మి.లీ పాలు చొప్పున ఇస్తున్నారు. గర్భిణులకు పప్పు చెక్కీలు, రాగి పిండి, బెల్లం, కర్జూరం పంపిణీ చేస్తున్నారు. గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపాన్ని తగ్గించేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.

9న కోడూరుమాత యాత్ర





కోడూరుమాత గుహ ప్రదేశం, గుహలోనున్న కోడూరుమాత విగ్రహం

కోడూరు(బాడంగి): విజయనగరం జిల్లా బాడంగి మండలం కోడూరులో వెలసిన పరిశుద్ధ కోడూరు మాత యాత్ర ఈ నెల 9వ తేదీ శనివారం నిర్వహించనున్నారు. గత నెల 31వ తేదీ నుంచే నవదిన ప్రార్థనలు ప్రారంభంకాగా, ఈ నెల 8వ తేదీ వరకు జపమాల, దివ్యపూజలు జరగనున్నవి. పదోరోజు యాత్రలో భాగంగా పర్వదిన కార్యక్రమాలు నిర్వహిస్తామని పుణ్యక్షేత్ర డైరెక్టర్ పి.యుగల్‌కుమార్ తెలిపారు.

పూజలు ఇలా..

ఈనెల 9వ తేదీ ఉదయం 7 గంటలకు జాబిలిగురువులతో మొదటిపూజ, 9 గంటలకు శ్రీకాకుళం పీఠాధిపతి డా.రాయవిజయ్‌కుమార్‌తో రెండవపూజ, ఉదయం 11 గంటలకు విశాఖ అగ్రపీఠాధిపతి డా.మల్లవరపు ప్రకాశ్ సమక్షంలో మూడవ పూజ, మధ్యాహ్నం ఒంటి గంటకు విజయనగరం డీనర్ గురువు, నూతన గురువులతో నాలగవపూజ , 3 గంటలకు దివ్యసత్ప్రసాద ఆరాధన, ద్వివ్య కారుణ్య జపమాల ఉంటుంది. అనంతరం మరియ తల్లి తేరుప్రదర్శన జరగనుంది.

పటిష్టబందోబస్తు..

ఉత్తరాంధ్ర, ఒడిశా భక్తులు అధికమంది కోడూరు మాత యాత్రలో పాల్గొనే అవకాశం ఉండడంతో బొబ్బిలి డీఎస్పీ పర్యవేక్షణలో సీఐ తిరుమలరావు, బొబ్బిలి, తెర్లాం, రామభద్రాపురం, బాడంగి ఎస్ఐలు బందోబస్తు విధులను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు భక్తుల రాకపోకలకు వీలుగా విజయనగరం, సాలూరు, పార్వతీపురం, శ్రీకాకుళం ఆర్టీసీ డీపోల నుంచి ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఆర్టీసీ యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది.